

నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు 'ఎక్స్' చాట్‌బాట్ గ్రోక్ ఇచ్చిన పలు సమాధానాలు

ఆర్థిక నేరగాళ్ల టేకాఫ్.. బీజేపీ రైటాఫ్!

- బ్యాంకులకు భారీగా ఎగనామం
- జాబితాలో మాల్యా, నీరవ్, చోక్సీ
- మోదీ సర్కారు వైఫల్యం వల్లే పరార్
- అరెస్టు చేయకపోవడంతోనే విదేశాలకు
- కుండబద్దలు కొట్టిన చాట్ బాట్ 'గ్రోక్'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: పేద, మధ్యతరగతి ప్రజల ముక్కుపిండి నయా పైసలతో సహా వసూలు చేసే బ్యాంకులు.. రూ.వేల కోట్లు తీసుకొని విదేశాలకు పారిపోయిన కార్పొరేట్ల అప్పులను మాత్రం రైటాఫ్ చేస్తున్నాయి. ప్రధాని మోదీ పదేండ్ల పాలనలో బ్యాంకులు ఇప్పటివరకు రూ.16.35 లక్షల కోట్లను రైటాఫ్ చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్రప్రభుత్వమే ఒప్పుకొన్నది. అయితే, బ్యాంకులను ముంచి విదేశాలకు పరారైన ఆర్థిక నేరగాళ్లు ఎవరు? ఎవరి హయాంలో వీరందరూ విదేశాలకు పారిపోయారు? ఎగవేతదారులు అలా వెళ్తుంటే, ప్రభుత్వ పెద్దలు ఏం చేస్తున్నారు? వంటి పలు సందేహాలు సామాన్యులకు కూడా వచ్చాయి. ఇవే ప్రశ్నలను ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను పలువురు నెటిజన్లు అడిగారు. ఈ ప్రశ్నలకు 'గ్రోక్' కుండబద్దలు కొట్టినట్టు సమాధానాలు ఇవ్వడం గమనార్హం.

జాబితా పెద్దదే..

బ్యాంకుల నుంచి పెద్దయెత్తున రుణాలు తీసుకొని మోదీ ప్రభుత్వ హయాంలో భారత్ నుంచి విదేశాలకు పారిపోయిన వారి జాబితా ఇవ్వాలంటూ 'గ్రోక్'ను ఓ నెటిజన్ కోరాడు. దీనికి 'గ్రోక్' స్పందిస్తూ.. మోదీ హయాంలో పలువురు కార్పొరేట్లు ఎగవేతలకు పాల్పడి విదేశాలకు పారిపోయినట్టు వెల్లడించింది. రూ.9,000 కోట్లను రుణంగా తీసుకొని 2016 లో విజయ్ మాల్యా యూకేకు పారిపోయినట్టు 'గ్రోక్' తెలిపింది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ పీఎన్‌బీకి రూ.14 వేల కోట్లను ఎగనామం పెట్టి 2018లో వరుసగా యూరప్, ఆంటిగోకు పరారయ్యారని 'గ్రోక్' వెల్లడించింది. సందేశర ఫ్యామిలీ (నితిన్, చేతన్, దీప్తి) మొత్తంగా రూ.5,000 కోట్లను ఎగవేసి 2018లో విదేశాలకు పారిపోయినట్టు 'గ్రోక్' తెలిపింది. సందేశర ఫ్యామిలీ కేసుకు సంబంధించే మరో ఆర్థిక నేరగాడు హితేశ్ పటేల్ రూ.8,100 కోట్ల రుణాలను బ్యాంకులకు చెల్లించకుండా 2018–19లో విదేశాలకు పరారైనట్టు వివరించింది. ఈ ఎగవేత కేసుల కారణంగా ఆర్థిక నియంత్రణ ఎలా ఉండాలి? రుణాల వసూలుకు సంబంధించి ఎదురయ్యే సవాళ్లు ఏమిటన్న అంశంపై దేశవ్యాప్తంగా పెద్ద యెత్తున చర్చ కూడా జరిగినట్టు వివరించింది. ఇక, విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులు మోదీ హయాంలోనే విదేశాలకు పారిపోయారా? అన్న మరో ప్రశ్నకు 'గ్రోక్'.. అవునంటూ సమాధానమిచ్చింది. యూపీఏ హయాంలో రుణాలు తీసుకొన్నప్పటికీ, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ స్కామ్‌లు వెలుగుచూశాయని, మోదీ ప్రభుత్వం ఉన్నప్పుడే మాల్యా, నీరవ్ మోదీ, చోక్సీ విదేశాలకు పారిపోయారని 'గ్రోక్' తేల్చిచెప్పింది. ఎలాంటి వివరాలను వడబోయకుండా తాను ఈ సమాధానం ఇస్తున్నట్టు వివరించింది.

బీజేపీ సర్కారు వైఫల్యం వల్లే..

విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ వంటివారు విదేశాలకు పారిపోవడానికి కారణం వారిని సకాలంలో దర్యాప్తు సంస్థల అధికారులు అరెస్ట్ చేయకపోవడమేనని గత ఏడాది ముంబైలోని ఓ ప్రత్యేక కోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై 'గ్రోక్'ను ఓ నెటిజన్ ప్రశ్నించగా.. కోర్టు వ్యాఖ్యలు సరైనవేనని చాట్‌బాట్ సమాధానమిచ్చింది. అధికారులు ముందుగా అరెస్ట్ చేస్తే, ఎగవేతదారులు అసలు దేశం విడిచి పారిపోయే పరిస్థితే ఉండేది కాదని 'గ్రోక్' అభిప్రాయపడింది. 'విజయ్ మాల్యా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లడానికి సూత్రధారి ఎవరు?' అని మరో నెటిజన్ 'గ్రోక్'ను ప్రశ్నించాడు. దీనికి చాట్‌బాట్ సమాధానమిస్తూ.. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు వ్యవస్థాగత వైఫల్యం వల్లే మాల్యా దేశాన్ని విడిచిపెట్టి పారిపోగలిగాడని 'గ్రోక్' తేల్చిచెప్పింది. మాల్యా కేసులో లుకౌట్ నోటీసులను మార్చారని, అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, మాల్యా మధ్య భేటీ జరిగిందంటూ కొన్ని వార్తలు వచ్చాయని, అయితే, వాటిలో నిజమెంత అనేది ఇంకా తెలియరాలేదని గ్రోక్ తెలిపింది.

చోక్సీ, నీరవ్.. మోదీ సన్నిహితులా?

బ్యాంకులకు వేల కోట్లను ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ, లలిత్ మోదీ గుజరాతీలా లేదా బెంగాలీలా? ప్రధాని మోదీకి లేదా బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో వీరికి సంబంధాలు ఉన్నాయా? అంటూ మరో నెటిజన్ గుజరాతీ భాషలో 'గ్రోక్'ను ప్రశ్నించాడు. దీనికి చాట్‌బాట్ స్పందిస్తూ.. మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ ఇద్దరూ గుజరాతీలని సమాధానమిచ్చింది. ప్రధాని మోదీతో వీరికి సంబంధాలు ఉన్నట్టు అభిప్రాయపడింది. లలిత్ మోదీ రాజస్థాన్‌కు చెందిన వాడన్న 'గ్రోక్'.. మోదీతో గాని లేదా మమతతో గాని ఆయనకు గల సంబంధాల గురించి పెద్దగా తెలియదని పేర్కొంది. దేశంలో అతి పెద్ద దొంగ ఎవరన్న మరో నెటిజన్ ప్రశ్నకు 'గ్రోక్' స్పందిస్తూ.. నీరవ్ మోదీ పేరును చెప్పింది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13,578 కోట్లను ఆయన ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయాడని 'గ్రోక్' వివరించింది.

కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రులు జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్, సీసీఐ సాధన కమిటీ సభ్యులు

ఆదిలాబాద్ సీసీఐని ప్రారంభించండి

- కేంద్రమంత్రికి బీఆర్ఎస్ వినతి

ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : మూతబడిన ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ను తిరిగి ప్రారంభించాలని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం ఢిల్లీలోని ఆయన చాంబర్‌లో రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదరరావు, మాజీ మంత్రులు జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు సీసీఐ సాధన కమిటీ సభ్యులు కలిశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులూ కేంద్ర మంత్రులకు వినతిపత్రం అందజేసినట్టు గుర్తుచేశారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పరిశ్రమను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వేలాది మందికి ఉపాధి కల్పించే సీసీఐ ప్రారంభానికి అవసరమైన ముడిసరుకు, విద్యుత్తు, ఇతర వనరులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి పరిశ్రమ ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. అలాగే, మహబూబ్‌నగర్‌లోనూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు.

హెచ్‌సీయూ భూములను కాపాడండి

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదరరావు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కేంద్ర మంత్రి.. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీలకు హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగ బాలు, విద్యార్థి నాయకులు ఉన్నారు.

సీఎండీ పోస్టుకు 20 కోట్ల బేరం

- డైరెక్టర్ పోస్టుకు రూ.2 కోట్లు
- గ్రేటర్‌లోని ఓ డీఈ పోస్టుకు రూ.40 లక్షలు
- విద్యుత్తు సంస్థల్లో ఉన్నత పదవుల కోసం బేరసారాలు
- ఏఈల బదిలీలకూ పెద్దల అనుమతి తీసుకోవాల్సిందే
- 9,10 తేదీల్లో డైరెక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో ఉన్నతస్థాయి నియామకాలు, పోస్టింగ్స్ వెనుక పెద్ద దందా నడుస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'పైసలిచ్చుకో.. పోస్టింగ్ తెచ్చుకో' అన్నట్టుగా పరిస్థితి తయారైందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తున్నదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. డిస్కం సీఎండీ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) వరకు పోస్టింగ్‌ను బట్టి రేటు నడుస్తున్నదని చెప్పుకుంటున్నారు. డిస్కం సీఎండీ పోస్టుకు రూ.20 కోట్లు అని, రూ.50 కోట్లు అని విద్యుత్తు సంస్థల ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు. 'ఫలానా వారికి కన్ఫర్మ్ అయ్యింది, పోస్టింగ్ రావడమే తరువాయి' అంటూ చెవులు కొరుక్కుంటున్నారు. డైరెక్టర్ పోస్టుకు రూ.రెండు కోట్లు అంటూ ప్రచారం జరుగుతున్నది. 2024 జనవరిలో కొత్త డైరెక్టర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించగా, ఐదు పోస్టులకు దాదాపు 91 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కరే రెండు మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకోవడంతో మొత్తంగా 152 దరఖాస్తులొచ్చాయి. వీరికి ఈ నెల 9, 10 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

వామ్మో! రెండు కోట్లా? నేనిచ్చుకోలేను

విద్యుత్తు సంస్థల్లో డైరెక్టర్ పోస్టులపై ఓ ఇద్దరు సీజీఎం స్థాయి అధికారుల మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. 'ఏం సార్.. కొత్త డైరెక్టర్ మీరేనట?' అని ఓ అధికారి అనగా, 'వామ్మో.. రూ.రెండు కోట్లు అంట! నేనైతే ఇచ్చుకోలేను. నా వల్ల కాదు. రూ.రెండు కోట్లు ఎక్కడి నుంచి తేవాలి?' అంటూ మరో అధికారి జవాబిచ్చారు. ఈ లెక్కన డిస్కంలలో డైరెక్టర్ పోస్టులకు రూ.రెండు కోట్లు పలుకుతున్నట్టు ఈ చర్చలను బట్టి స్పష్టమవుతున్నది. డైరెక్టర్ పోస్టుల కోసం ప్రధానంగా రిటైర్డ్ సీఈలు, సీజీఎంలు, ప్రస్తుతం పనిచేస్తున్న వారు సైతం డైరెక్టర్ పోస్టుల కోసం పోటీపడుతున్నారు. డైరెక్టర్ పోస్టు కోసం ఒక మహిళా అధికారి ఏకంగా ఏఐసీసీ అగ్రనేతను ఆశ్రయించినట్టు తెలిసింది. ఆయన నుంచి అభయం దొరకడంతో తనకు డైరెక్టర్ పోస్టు ఖాయమైనట్టు ఆమె ప్రచారం చేసుకుంటున్నారు.

ఏఈని బదిలీ చేయాలన్నా..

గతంలో విద్యుత్తు సంస్థల్లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లను సీఎండీల స్థాయిలోనే బదిలీచేసేవారు. ఇతరులెవరూ కింది స్థాయి బదిలీల్లో జోక్యం చేసుకునే వారు కాదు. డీఈ ఆ పై స్థాయి బదిలీలు, పోస్టింగ్‌ల్లో మాత్రమే పై స్థాయిలోని వారు కల్పించుకునే వారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఏఈల బదిలీల్లోనూ ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుంటున్నారు. చిన్నస్థాయి పోస్టు అయిన ఏఈ బదిలీకి, పోస్టింగ్‌కు సైతం పై నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చని విద్యుత్తురంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

డీఈ పోస్టుకు రూ.40 లక్షలు

గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆపరేషన్స్ డివిజినల్ ఇంజినీర్ (డీఈ) పోస్టుకు రూ.40 లక్షలు సమర్పించుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఒక ఎమ్మెల్యే ద్వారా ఒక డీఈ మంత్రాంగం నడిపారని తెలిసింది. ఈ ప్రయత్నం ఫలించగా, రూ.40 లక్షలు ముట్టజెప్పినట్టు ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు. మేడ్చల్ సర్కిల్‌లోని ఈ డీఈ పోస్టు ఫోకల్ పోస్టు కావడంతో రూ.40 లక్షలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. పోస్టింగ్స్ కోసం వస్తున్న ఒత్తిళ్లు తట్టుకోలేక సీఎండీ ఒకరు, 'ఇప్పుడైతే పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. రేపు ఎట్లా పనిచేస్తారో చూస్తా' అని హెచ్చరించడం గమనార్హం. అవినీతి ఇంజినీర్లు, అధికారుల చిట్టాను ఏసీబీకి అందజేస్తానంటూ ఆయన బహిరంగంగా హెచ్చరించినట్టు విద్యుత్తు ఇంజినీర్లే చెవులు కొరుక్కుంటున్నారు. కొందరు అసోసియేషన్ నేతలు పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రేటర్‌లో ఫోకల్ పోస్టులు ఖాళీ అవుతున్నాయనంటే కర్చిఫ్ వేసేందుకు మరొకరు సిద్ధమవుతున్నారు. ఇక ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చేందుకు కొందరు అసోసియేషన్ నేతలు రూ.రెండు లక్షల చొప్పున వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది.

ప్రియుడి మోజులో పడి.. ముగ్గురు పిల్లలను కడతేర్చిన తల్లి

కంది, ఏప్రిల్ 2: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని ముగ్గురు చిన్నారులను కడతేర్చింది కన్నతల్లి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడలో గతనెల 27న చోటుచేసుకోగా పోలీసులు బుధవారం ఈ కేసు గుట్టువిప్పారు. బీరంగూడ రాఘవేంద్ర కాలనీలో నివాసముంటున్న రజిత ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా, ఆమె భర్త చెన్నయ్య డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. మొదటి నుంచి రజితకు చెన్నయ్య అంటే ఇష్టం ఉండేది కాదు. ఆరునెలల క్రితం టెన్త్ బ్యాచ్‌మేట్స్ గెట్ టు గెదర్ పార్టీలో రజితకు శివకుమార్‌తో స్నేహం ఏర్పడింది. రోజూ చాటింగ్‌లు, వీడియోకాల్స్ ద్వారా మాట్లాడుకునే వారు. పెండ్లి కాని శివకుమార్‌ను ఎలాగైనా పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నది. పిల్లలు లేకుండా ఒంటరిగా వస్తే పెండ్లి చేసుకుంటానని శివ హామీ ఇచ్చాడు. దీంతో పిల్లలను అడ్డు తొలిగించుకోవాలనుకున్నది రజిత. మార్చి 27న రాత్రి భర్త లేని సమయంలో పెద్ద కొడుకు సాయికృష్ణ , కూతురు మధుప్రియ, చిన్న కొడుకు గౌతమ్‌లను టవల్‌తో ఊపిరాడకుండా చేసి చంపినట్టు విచారణలో తేలింది. రజిత, శివకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

7న జీఆర్ఎంబీ భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశాన్ని 7న నిర్వహించనున్నారు. బోర్డు చైర్మన్ రెండు తెలుగు రాష్ట్రాలకు సమాచారం అందజేశారు. రెండు రాష్ట్రాల అభిప్రాయం మేరకు సమావేశ తేదీని నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ, జీఆర్ఎంబీ మాత్రం ఏకపక్షంగా తేదీని ఖరారు చేస్తున్నదని తెలంగాణ, ఏపీ అధికారులు నిప్పులు చెరుగుతున్నారు. దీంతో జీఆర్ఎంబీ సమావేశం మరోసారి వాయిదా పడే అవకాశం కనిపిస్తున్నది.

7 నుంచి 15 వరకు 'పది' మూల్యాంకనం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి వార్షికపరీక్షలు బుధవారంతో ముగిశాయి. జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 7 నుంచి 15వరకు 9 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలో 19 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

యూట్యూబర్‌పై బీజేపీ కార్యకర్తల దాడి

బండ్లగూడ, ఏప్రిల్ 2: బీజేపీ నాయకుడు, చిత్రగుప్త యూట్యూబ్ చానల్ యజమాని గిరీశ్‌పై మంగళవారం అదే పార్టీ నాయకులు దాడి చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై గిరీశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కోపోద్రిక్తులైన కొందరు ఈ దాడికి పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం అతనిపై బీజేపీ కార్యకర్తలు తరలివచ్చి గిరీశ్‌పై, సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. సమాచారం తెలియగానే పోలీసులు వచ్చి గిరీశ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడి ఘటనపై కేసు నమోదు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని గిరీశ్ ఆందోళన వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో బిల్లు.. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా

- రేవంత్ సర్కారు తీరుపై బీసీ వర్గాల ఆగ్రహం
- గవర్నర్ ఆమోదం తీసుకోకుండా.. చట్టం చేయకుండానే నిరసనలా?
- కార్యక్రమానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే డుమ్మా
- సీపీఐ మినహా ఎవరూ హాజరుకాని దుస్థితి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరు 'గోల్‌మాల్ గోవిందం' తరహాలో ఉన్నది. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు ఇంకా గవర్నర్ వద్దనే ఉన్నాయి.. వాటిపై ఏ నిర్ణయం తీసుకోలేదు. చట్టంగా మారలేదు. ఆ బిల్లుల అమలు కోసం ప్రభుత్వం కూడా ఎలాంటి జీవో తీసుకురాలేదు. కానీ, ఆ బిల్లులను ఆమోదించాలంటూ ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా చేపట్టడం విడ్డూరంగా ఉందని బీసీ మేధావులు, కుల సంఘాల నేతలు మండిపడుతున్నారు. 'బిల్లులు చేశాం. బాధ్యత తీరింది. కేంద్రం ఆమోదిస్తే అమలు చేస్తాం' అన్నట్టుగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని విమర్శిస్తున్నారు. స్థానిక సంస్థలతోపాటు విద్యా, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించాల్సి ఉన్నది. అవి చట్టంగా మారాక ప్రభుత్వం అమలులోకి తీసుకురావాల్సి ఉంటుంది. న్యాయపరమైన సవాళ్లు ఎదురైతే కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరి ఆమోదముద్ర వేయించుకోవాలి. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. పెంచిన బీసీ రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురాకుండానే వాటిని ఆమోదించాలంటూ ఢిల్లీలో ధర్నా నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అనుకూల బీసీ సంఘాలను ముందుంచి కేంద్రంపై నెపం నెట్టడం ద్వారా తప్పించుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కారు ఎత్తులు వేస్తున్నదని వారు మండిపడుతున్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా అట్టర్‌ఫ్లాప్

బీసీ రిజర్వేషన్ల పెంపునకు బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలన్నీ మద్దతు పలకడంతో పాటు అవసరమైతే ఢిల్లీకి కూడా వస్తామని ప్రకటించాయి. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని ప్రభుత్వ పెద్దలు కూడా అసెంబ్లీ వేదికగా ప్రగల్భాలు పలికారు. కానీ, ఆ బిల్లులు చట్టంగా మారకముందే కాంగ్రెస్ బుధవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించింది. ఆ ధర్నా అట్టర్‌ఫ్లాప్ అయింది. ఆ ధర్నాకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేవలం కొద్ది మంది బీసీ సంఘం నేతలనే ఆహ్వానించారు. దీంతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, కొందరు మంత్రులు, మిత్రపక్షమైన సీపీఐ నుంచి నారాయణ తప్ప ఎవరూ హాజరు కాలేదు. బీసీ సంఘాలు, కుల సంఘాలు, బీసీ మేధావులు కూడా పాల్గొనలేదు. ఢిల్లీలోనే ఉన్న రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కూడా ఆ ధర్నా వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

కాంగ్రెస్ తీరుతో బీసీలకు అన్యాయం

- వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌తో ఆమోదింపజేసుకోకుండానే ధర్నాల పేరిట రాజకీయం చేస్తున్నదని, తద్వారా బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నదని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ధ్వజమెత్తారు. కులగణన, రిజర్వేషన్ల పెంపునకు బీసీలు సాగిస్తున్నది ధర్మపోరాటమేనని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో రేణుక మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రేణుకకు కడవెండి కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన ఎర్రబెల్లి, పల్లా

దేవరుప్పుల, ఏప్రిల్ 2: జనగామ జిల్లా దేవ రుప్పుల మండలం కడవెండికి చెందిన మావోయిస్ట్ నాయకురాలు గుమ్మడవెల్లి రేణుక అంత్యక్రియలు బుధవారం గ్రామంలో జరగ్గా, వేలాది మంది జనం హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమె మృతదేహం మంగళవారం అర్ధరాత్రి గ్రామానికి చేరింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా రేణుక ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని పోలీసులు ప్రకటించడం బూటకమని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ప్రైవేటు పట్టా భూమిలోనే 'మైహోం విహంగ'

- కోర్టు ఆదేశాలతో 2008లోనే హెచ్‌సీయూ భూమి లింగమయ్యకు బదలాయింపు
- 2013లో 'మైహోం' సంస్థకు అమ్మేసిన భూ యజమానులు
- 2013 జూలైలోనే విహంగ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు పట్టా భూమిలోనే 'మైహోం విహంగ' అపార్ట్‌మెంట్లను నిర్మించినట్టు గతంలో కలెక్టర్లు ఇచ్చిన ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. 2008లోనే హైకోర్టు తీర్పు ద్వారా హెచ్‌సీయూ భూమిని ప్రభుత్వమే లింగమయ్యకు బదలాయింపు చేసినట్టు రికార్డులున్నాయి. ఆ భూమిని యజమానులు 2013లో 'మైహోం' సంస్థకు విక్రయించడంతో అదే ఏడాది జూలైలో 'విహంగ' అపార్ట్‌మెంట్ల నిర్మాణం ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 14, 16 నుంచి 23 వరకు ఉన్న 25 ఎకరాల 31 గుంటల భూమికి అసలు పట్టాదారు లింగమయ్య. ఆ భూమి హెచ్‌సీయూకి కేటాయించిన భూముల మధ్య ఉండటంతో దానిని వర్సిటీ ఆక్రమించుకున్నది. దీనిపై లింగమయ్య కేసు (O.S. No.193/92) వేయడంతో ఆ భూమిని ఖాళీచేసి లింగమయ్యకు అప్పగించాలని హెచ్‌సీయూని ఆదేశిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. కానీ, ఆ భూమి చుట్టూ హెచ్‌సీయూ భూములు ఉండటంతో లింగమయ్య వారసులు తమ భూమిలోకి వెళ్లేందుకు బాట లేకుండా పోయింది. బ